క్లుప్తంగా

విద్యార్థులకు పెన్నులు, నోటుబుక్స్ పంపిణీ



విద్యార్థులకు పెన్నులు, నోటుబుక్స్ అందజేస్తున్న సత్యనారాయణ

ముమ్మిడివరం: ముమ్మిడివరం శివారు రాజుపాలెం ప్రాథమిక పాఠశాలలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పితాని వీరవెంకట సత్యనారాయణ శనివారం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, పెన్నులు, నోట్‌బుక్స్ అందజేశారు. విద్యాభివృద్ధికి తోడ్పాటునందిస్తున్న సత్యనారాయణ మాస్టారును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రాజశేఖర్, గ్రామస్తులు అభినందించారు.

కౌమార దశ ఎంతో కీలకం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్

యానాం: భవిష్యత్‌లో తాము ఏం కావాలనుకుంటున్నారో స్పష్టమైన అవగాహన కౌమార దశలో కలుగుతుందని, ఈ దశ ఎంతో కీలకమని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం స్థానిక కనకాలపేట ఎస్‌కేఎస్‌పీవీఆర్ ప్రభుత్వ హైస్కూల్‌లో అడలసెంట్ అండ్ కెరీర్ గైడెన్స్ అనే అంశంపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు పదో తరగతి అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



మురమళ్ల జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ కమలకుమారి

ఐ.పోలవరం: జిల్లా విద్యాశాఖాధికారి కమలకుమారి మురమళ్ల జెడ్పీ పాఠశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఏ విధంగా సిద్ధమవుతున్నారన్న విషయంపై ఆరా తీశారు. మంచి మార్కులు తెచ్చుకోవడానికి విద్యార్థులకు మెళకువలు తెలియజేశారు. ప్రభుత్వం ఎనిమిదో తరగతి విద్యార్థులకు ఇచ్చిన బైజూస్ ట్యాబ్స్‌ని ఎంతవరకూ వినియోగించుకొంటున్నారో పరిశీలించారు. ఆమె వెంట జిల్లా డీసీఐబీ సెక్రటరీ హనుమంతరావు, జిల్లా ఎగ్జామినేషన్ ఇన్‌చార్జి రమణశ్రీ,, ఎంఈవో కె.వెంకటేశ్వరావు తదితరులున్నారు.

అవతార్ మెహర్‌బాబా జన్మదిన వేడుకలు



అవతార్ మెహర్‌బాబా చిత్రపటానికి పూజలు చేస్తున్న జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వానపల్లి వారి వీధిలో అవతార్ మెహర్‌బాబా ఆధ్యాత్మిక కేంద్రంలో బాబా జన్మదిన వేడుకలు శనివారం జరిగాయి. తొలుత అవతార్ మెహర్‌బాబా చిత్రపటానికి సంఘ ప్రతినిధులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక కేంద్రం ప్రతినిధి వానపల్లి అప్పలచార్యులు, జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్యాసిదాసు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుపాటి వేణుగోపాల్, సంఘ ప్రతినిధులు కొల్లు జ్ఞానేశ్వర్, కోసూరి చిదంబర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అశ్వవాహనోత్సవం



అశ్వవాహనోత్సవంలో ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి తదితరులు

యానాం: యానాం భూసమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శనివారం రాత్రి అశ్వవాహనోత్సవం ఘనంగా జరిగింది. పుదుచ్చేరికి చెందిన నల్లం వెంకటరామయ్య ఉత్సవదారులుగా నిర్వహించిన అశ్వవాహనోత్సవంలో ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఆర్ఏఓ మునిస్వామి, ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ తదితరులు పాల్గొని స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై ఉన్న స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

మాతాశిశు రక్షణకు కిల్కారీ సేవలు

- నరికొత్త కార్యక్రమంతో కేంద్రం రూపకల్పన
- యాప్ ద్వారా శిక్షణ పొందుతున్న ఆరోగ్య, ఆశా సిబ్బంది



కిల్కారీ సేవలపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఉన్నతాధికారులు

ఉప్పలగుప్తం: మాతా శిశు సంరక్షణే లక్ష్యంగా కిల్కారీ పేరుతో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంరక్షణ శాఖ కొత్త కార్యక్రమానికి రూపకల్పన చేసింది. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాలించాల్సిన ఆరోగ్య నియమాలు, వైద్యపరీక్షలు తదితర అంశాలపై వారిని అప్రమత్తం చేసేందుకు ప్రభుత్వం దీన్ని అందుబాటులోకి తీసుకొస్తుంది. ఈ మొబైల్ యాప్ ఉపయోగించే విధానంపై ప్రస్తుతం ఆరోగ్య, ఆశ కార్యకర్తలకు జూమ్ సాఫ్ట్‌వేర్ ద్వారా సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు.

అమల్లోకి వచ్చేది ఇలా

హలో అక్కా నేను మీ డాక్టర్‌ను మాట్లాడుతున్నా... మీ ఆరోగ్యం ఎలా ఉంది.. అనే ఆప్యాయమైన పలకరింపుతో గర్భిణులు, బాలింతలకు క్రమంగా సందేశాలు, ఫోన్లు వస్తుంటాయి. మహిళలు గర్భం దాల్చిన మూడో నెల ప్రారంభం నుంచి ప్రతి నెల, వారంలో ఏ మందులు వాడాలి, ఏ రకమైన ప్రొటీన్‌తో కూడిన ఆహారం తీసుకోవాలి అనే విషయాలపై అవగాహన పరుస్తుంటారు. దీంతో పాటు డాక్టర్‌ను ఎలాంటి సమయాల్లో సంప్రదించాలో తెలియజేస్తారు. గర్భిణులు, బాలింతలు కమ్యూనికేషన్ చేయడానికి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు వారి ఇళ్ల వద్దకు వెళ్లి పేరు, పూర్తి చిరునామా, సెల్ ఫోన్ నెంబర్, అంచనా ప్రసవ తేదీ వంటి వివరాలను ప్రభుత్వ ఆరోగ్య కేంద్ర రికార్డుల్లో నమోదు చేస్తారు. అప్పటి నుంచి గర్భిణులు, బాలింతలకు కిల్కారి సేవలు (ప్రతి తల్లి ఆరోగ్య స్వీయ ఆరోగ్య సేవలు) ప్రారంభమవుతాయి. గర్భిణులు, బాలింతలు చెప్పే సమాధానాల ఆధారంగా ఆరోగ్య సమాచారాన్ని సేకరిస్తారు. కరోనా వంటి సమయంలోను, తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సరైన అవగాహన లేక కొన్ని మాతృ మరణాలు సంభవించాయి. మరికొందరు పౌష్టికాహార, రక్తహీనత లోపాలతో ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకే ప్రభుత్వం ఈ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది.

గర్భిణిగా నిర్ధారణ అయినప్పటి నుంచే



మహిళ గర్భం దాల్చిందని తెలిసిన 3వ నెల నుంచే వారికి ఈ కిల్కారీ సేవలు మొదలవుతాయి. వారి ఫోన్ నెంబర్ మా సిబ్బంది తీసుకుని ఎప్పటికప్పుడు సంప్రదిస్తారు. ఏ నెలలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో, ఏఏ జాగ్రత్తలు తీసుకోవాలో ఫోన్ ద్వారానే పూర్తి అవగాహన కల్పిస్తారు. ఏదైనా సమస్య ఉంటే పీహెచ్‌సీకి వచ్చినప్పుడు పరీక్షించి వైద్యం అందిస్తాం.

– డాక్టర్ సుమ, గోడిలంక పీహెచ్‌సీ, అల్లవరం మండలం

అగ్నిప్రమాద బాధితులకు మంత్రి పరామర్శ



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ఇంటిని పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: సామంతకుర్రు అంబేడ్కర్ నగర్‌లో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగి సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత నక్కా ధనలక్ష్మి కుటుంబాన్ని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం పరామర్శించారు. నిరాశ్రయులైన కుటుంబానికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ సుందరనీడి సాయి, కర్రి శ్రీను తదితరులున్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

సామంతకుర్రు ప్రధాన రహదారి నుంచి వాసాలతిప్ప డ్రెయిన్ వరకు రూ.3.98 కోట్లతో నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను మంత్రి విశ్వరూప్ పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణంతో రెండు మండలాలకు రాకపోకలు సులభతరమవుతాయని చెప్పారు.

మంత్రి విశ్వరూప్‌ను కలిసిన మాజీ మంత్రి మల్లాడి

అమలాపురం టౌన్: పాండిచ్చేరి రాష్ట్ర మాజీ మంత్రి, తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు మల్లాడి కృష్ణారావు అమలాపురంలోని కాటన్ అతిథి గృహంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వారిద్దరూ కాసేపు పలు విషయాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్‌ను మల్లాడి కృష్ణారావు దుశ్శాలువాతో సత్కరించారు.

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన అమలాపురానికి చెందిన జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం రాత్రి అభినందించి సత్కరించారు. స్థానిక కాటన్ అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో అమలాపురం, ఉప్పలగుప్తం మండలాల జడ్పీటీసీ సభ్యులు పందిరి శ్రీహరి రామగోపాల్, గెద్దం సంపదరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్యే పొన్నాడ సతీష్‌కుమార్‌లు సైతం వారి నివాసాల వద్ద ఖాదర్‌ను వేర్వేరుగా శనివారం అభినందించారు.



మంత్రి విశ్వరూప్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ మంత్రి కృష్ణారావు

అమలాపురం రూరల్: బండారులంకకు చెందిన కోనసీమ వైఎస్సార్ సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన కాలెపు నాగ శ్రీనివాసరావును రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ పుష్పగుచ్ఛంతో సత్కరించారు. చేనేత సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీనివాసరావుకు మంత్రి విశ్వరూప్ సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాసరావు, చేనేత సొసైటీ అధ్యక్షుడు చింతా ఉమామహేశ్వరరావు, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి జాన గణేష్ తదితరులున్నారు.

అమలాపురం టౌన్: చిరంజీవి యువత జాతీయ ఉపాధ్యక్షుడు, స్థానిక మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీనును మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న శ్రీనును స్థానిక తామర చెరువు పార్కు వద్ద ఉన్న ఆయన ఇంటికి మంత్రి విశ్వరూప్ వెళ్లి సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు సత్కారం



ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్ దంపతులు

అమలాపురం టౌన్: తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించేందుకు సహకరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ దంపతులను ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్ దంపతులు శనివారం రాత్రి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే పొన్నాడ ఇంటికి ఇజ్రాయిల్, హైమావతి దంపతులు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో హితకారిణి సమాజం చైర్‌పర్సన్, జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు కాశి మునికుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లా నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సహకార ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ముమ్మిడివరం: సహకార సంఘాల ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీ సత్యనారాయణరాజు డిమాండ్ చేశారు. ముమ్మిడివరం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి ఆవరణలో శనివారం కోనసీమ జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాజన సభ జరిగింది. సమావేశంలో జిల్లా యూనియన్ నూతన కార్యవర్గం ఎంపికైంది. అధ్యక్షుడిగా యర్రంశెట్టి రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా పెంకే సత్యనారాయణ, పలువురు సభ్యులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కడగల ఆదినారాయణ, రాష్ట్ర కోశాధికారి తోట వెంకట రామయ్య, సీహెచ్ వెంకటేశ్వరరావు, పి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యానాం వెంకన్న ఆభరణాలను బహిర్గతం చేయాలి

ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్



ఆభరణాల వివరాలు తెలపాలని కోరుతున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

యానాం: యానాంలో కొలువైన భూసమేత వేంకటేశ్వరస్వామివారికి పూర్వం నుంచి ఉన్న ఆభరణాల వివరాలను భక్తుల కోరిక మేరకు బహిర్గతం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ అధికారులపై ఉందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శనివారం యానాం వెంకన్న ఆభరణాలు ఎక్కడున్నాయి, వాటి భద్రత గురించి స్థానిక భక్తులు, వివిధ సంఘాల ప్రజల ఆందోళన నేపథ్యంలో ఆర్ఏఓ చాంబర్‌లో రీజనల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణన్ తదితరులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ 600 ఏళ్ల చరిత్ర కలిగిన యానాం వేంకటేశ్వరస్వామికి అనేక ఏళ్లుగా భక్తులు బంగారు, వెండి వస్తువులు, ఆభరణాలను ఇస్తున్నారని, అయితే వివరాలను వెల్లడించకుండా గోప్యత పాటించడం సరికాదన్నారు. ప్రస్తుతం కల్యాణ ఉత్సవ కమిటీని అధికారులే నిర్వహిస్తున్నారు కనుక వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎల్‌ఏడీ సెక్రటరీ గిడ్డి బలరాం, పండు సిద్దార్థకుమార్, మాగాపు సుబ్బారావు, భక్తులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంతో కఠిన శిక్షలు



పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ కొండలరావు



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీను నాయక్

అమలాపురం టౌన్: బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం ద్వారా కఠిన శిక్షలు పడతాయని అమలాపురం పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు అన్నారు. స్థానిక విద్యానిధి కళాశాలలో పట్టణ పోలీసు సర్కిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండలరావు మాట్లాడుతూ బాలికలపై అశ్లీల చిత్రీకరణ చేసినా, వేధించినా నేరమేనని తెలిపారు. విద్యాలయాల్లో బాలబాలికలు సోదర భావంతో మెలగాలన్నారు. ఎవరైనా వెకిలి వేషాలేస్తే పోలీసులకు తక్షణం సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సీఐ సూచించారు. పోక్సో చట్టం ద్వారా కోర్టులు విధించే కఠిన శిక్షలపై అవగాహన కల్పించారు. సదస్సులో విద్యార్థులతో పాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

లైంగిక వైధింపులకు పాల్పడితే చర్యలు

అల్లవరం: చిన్న పిల్లలపై లైంగిక వేధింపులు, మొబైల్‌లో అశ్లీల దృశ్యాల చిత్రీకరణకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రీను నాయక్ అన్నారు. గుడ్డివానిచింత వద్ద రవితేజ కాలేజీలో శనివారం లైంగిక వైధింపులు, పోక్సో చట్టం, ఐటీ చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. టెక్నాలజీని వినియోగించుకుని పిల్లలు, మహిళల అసభ్యకరమైన చిత్రాలను షూట్ చేసి సోషల్ మీడియాలో పెడుతామని బెదిరించే ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆయన చెప్పారు. చట్టం దృష్టిలో అందరూ సమానమని, తప్పు చేస్తే ఏ ఒక్కరిని వదలిపెట్టమని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మోసపూరిత వ్యక్తుల విషయంలో యువత జాగ్రత్తగా ఉండాలని తాలూకా ఎస్ఐ అందే పరదేశి అన్నారు. బాలికల సంరక్షణ చట్టం, అంతర్జాలంలో సాంకేతిక పరిజ్ఞానంపై శనివారం కామనగరువు జెడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో చట్టాలు, శిక్షల గురించి వివరించారు.

కోరంగి ఆక్వా గ్రామసభ రసాభాస



కోరంగి ఆక్వా గ్రామసభలో జరుగుతున్న వాగ్వివాదం

తాళ్లరేవు: రొయ్యలు, చేపల చెరువుల తవ్వకాలకు సంబంధించి స్థానిక ప్రజలు, రైతుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు కోరంగిలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆక్వా గ్రామసభ రసాభాసగా ముగిసింది. గ్రామసభకు పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల నుంచి ఆక్వా రైతులు, గ్రామస్తులు హాజరయ్యారు. బొడ్డువానిలంక, కోరంగి పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో చెరువులను అక్రమంగా తవ్వేస్తున్నారని, వ్యవసాయ భూముల చెంత మత్స్యశాఖ అధికారులు అనుమతులు ఎలా ఇస్తున్నారంటూ పలువురు ప్రశ్నించారు. దీనిపై తహసీల్దార్ ఎస్.పోతురాజు స్పందిస్తూ ప్రజల నుంచి అభ్యంతరాలు వస్తే వాటిని పూర్తిగా పరిశీలించిన తరువాతే అనుమతులు ఇస్తామన్నారు. గ్రామసభలో సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యురాలు పోతుల రత్నకుమారి, వివిధ అధికారులు పాల్గొన్నారు.

పాళ్లమ్మకు ఇత్తడి గరగ సమర్పణ



అమ్మవారికి ఇత్తడి గరగ సమర్పిస్తున్న సాయికుమార్ దంపతులు

మామిడికుదురు: కొమరాడ గ్రామదేవత శ్రీపాళ్లమ్మకు అదే గ్రామానికి చెందిన కొడమంచిలి సాయికుమార్, దుర్గాదేవి దంపతులు శనివారం ఇత్తడి గరగ సమర్పించారు. రెండు కిలోల గరగను ఆలయ అర్చకుడు వి.శ్రీనుకు అందజేశారు. గరగకు ప్రత్యేక పూజలు చేశారు. పాళ్లమ్మ వారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఇత్తడి గరగను సమర్పించామని సాయికుమార్ చెప్పారు. కార్యక్రమంలో కటికిరెడ్డి వరబాబు, కోట పరమేష్, చేట్ల సత్యనాయణ, ఎంపీపీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కిక్కిరిసిన వేంకటేశ్వరుని ఆలయం

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరుని ఆలయం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. స్వామిని అధిక సంఖ్యలో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి అన్న ప్రసాదం స్వీకరించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఇజ్రాయిల్‌కు సత్కారం

అమలాపురం టౌన్: ఎమ్మెల్సీ అభ్యర్థి బొమ్మి ఇజ్రాయిల్‌ను పట్టణ ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ అధ్యక్షుడు కొప్పుల బాబి ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కాలనీలో శనివారం ఘన సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాది తొమ్మండ్ర గోపి, ఎస్సీ, ఎస్టీ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

28న సీఐ శివగణేష్ ఉద్యోగ విరమణ సభ

యానాం: 1983లో హోంగార్డు కేడర్ నుంచి ఎస్ఐ, సీఐ, ఇన్‌చార్జి ఎస్పీ స్థాయి వరకు వివిధ హోదాల్లో 40 ఏళ్ల పాటు సేవలందించిన సీఐ గూటం శివగణేష్ ఈ నెల 28న ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా స్థానిక పోలీస్ కాంప్లెక్స్‌లో సత్కార సభను నిర్వహించనున్నామని నిర్వాహకులు చంద్రశేఖర్ తెలిపారు.

సత్తెమ్మ సన్నిధిలో పుదుచ్చేరి ఆర్టీఓ

ముమ్మిడివరం: పుదుచ్చేరి ఆర్టీఓ బాలసుబ్రహ్మణ్యం శనివారం ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లి సత్తెమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుబ్రహ్మణ్యంకు ఆలయ నిర్వాహకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

కుడుపూడికి సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక హైస్కూలు సెంటరులోని శెట్టిబలిజ గ్రంథాలయం వద్ద శనివారం ఎమ్మెల్సీ అభ్యర్థి కుడుపూడి సూర్యనారాయణరావును రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం ఉద్యోగుల సంఘం ప్రతినిధులు సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మడికి శ్రీరాములు, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంఘ కార్యదర్శి తెన్నేటి రాజబాబు, కోనసీమ జిల్లా అధ్యక్షుడు మడికి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు నవుండ్రు లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి మండల స్థాయిలో స్పందన

అల్లవరం: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక నుంచి ప్రతి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.సరోవరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్పందన కార్యక్రమానికి అన్ని శాఖల మండలాధికారులు హాజరై ఫిర్యాదులు తీసుకుంటారన్నారు. మండల స్థాయి స్పందనను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

1న కోదండరామ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు శివారు రంగనాయకపురంలో కొత్తగా నిర్మించిన కోదండరామ ఆలయంలో వచ్చే నెల 1వ తేదీన కోదండరామ పరివార దేవతల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నెల 27వ తేదీన ప్రారంభమై రెండు రోజుల పాటు విశేష పూజల అనంతరం 1వ తేదీ బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని చెప్పారు.

మార్చి 13న బడ్జెట్ సమర్పణ

యానాం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను మార్చి 13న పుదుచ్చేరి అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నట్లు స్పీకర్ ఆర్.సెల్వం తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మార్చి 9న ఉదయం 9.30 గంటలకు అసెంబ్లీలో ఇన్‌చార్జి లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పాల్గొని సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తారన్నారు. మార్చి 13న ఆర్థికశాఖను సైతం నిర్వహిస్తున్న సీఎం రంగసామి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారన్నారు.

రసాయనరహిత వ్యవసాయంతో మేలు

ఉప్పలగుప్తం: రసాయనరహిత వ్యవసాయంతో ఆరోగ్యానికి మేలు జరుగుతుందని మండలంలోని భీమనపల్లి, విలసవిల్లి గ్రామాల్లో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయ సాగును చేపట్టారు. భీమనపల్లి పంచాయతీ పరిధిలోని సింగరాయిపాలెంలో నవధాన్యాల సాగు– నేలతల్లి బాగు అనే నినాదాలతో స్థానికంగా ఉన్న పాఠశాల విద్యార్థులతో ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ ఇన్‌చార్జ్ దేవి మాట్లాడుతూ రైతులంతా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకుని రసాయన రహిత వ్యవసాయాన్ని సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పెయ్యిల రాజ్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, ఎస్‌డీఏ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.